క్లుప్తంగా

వైఎస్సార్ బీమా నగదు పంపిణీ

నకరికల్లు: బీమా పథకాలు పేదలకు ఆసరాగా నిలుస్తున్నాయని కార్యదర్శి కె.అప్పారావు అన్నారు. మండలంలోని చల్లగుండ్ల గ్రామానికి చెందిన కొప్పుల సాంబయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. డాక్టర్ వైఎస్సార్ బీమా కింద మృతుడి భార్య, నామిని కొప్పుల వెంకటరమణకు రూ.10వేలు సోమవారం అందజేశారు. మిగిలిన రూ.90 వేలు నామినీ ఖాతాకు ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వం జమ చేస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచి అరవా ఆదిలక్ష్మి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు గోపు పద్మావతి అంజిరెడ్డి, జక్కిరెడ్డి కోటిరెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ రాంబాబు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లు అరెస్ట్

పెదకూరపాడు: మండలంలోని లగడపాడు గ్రామంలో పేకాటాడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకట్రావు తెలిపారు. గ్రామంలోని శివారు ప్రాంతంలో ఎనిమిది వ్యక్తులు పేకాటాడుతూ పట్టుపడ్డారు. వీరి వద్ద నుంచి రూ.8,750 స్వాధీనం చేసుకుని సత్తెనపల్లి కోర్టులో హాజరు పరిచినట్లు చెప్పారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థికి ఆర్థిక చేయూత

పెదకూరపాడు: తల్లిదండ్రులను కోల్పోయి అత్తమామల సంరక్షణలో ఉంటూ ఆర్థిక ఇబ్బందులతో పదో తరగతి మానేసిన లోకేష్ అనే విద్యార్థికి ఎన్నారై మాగులూరి భాను ప్రకాష్ చేయూతనిచ్చారు. విద్యకవసరమయ్యే ఆర్థిక సహాయాన్ని అందించి స్థానిక కాకతీయ పాఠశాలలో చేర్పించారు. కరస్పాండెంట్ లలితబాబుకు విద్యార్థికి అవసరమైన ఫీజును హైకోర్టు న్యాయవాది మాగులూరి హరిబాబు, ఫౌండేషన్ సభ్యులు కుంచనపల్లి కిరణ్‌కుమార్ అందించారు.

గ్రామ ఆరోగ్య కమిటీలు ఏర్పాటు చేయాలి


ముప్పాళ్ల: మండలంలోని అన్ని గ్రామాల్లోను గ్రామ ఆరోగ్య కమిటీలు ఏర్పాటు చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారి పీ రమాదేవి చెప్పారు. స్థానిక పీహెచ్‌సీలో ఆశ డే లో భాగంగా ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో వైద్యాధికారి రమాదేవి మాట్లాడుతూ గ్రామకమిటీ సభ్యులు, గ్రామస్తులతో నెలలో 1వ, 3వ శుక్రవారం వైఎస్సార్ ఆరోగ్యకేంద్రంలో సమావేశం నిర్వహించాలన్నారు. ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు వి.జయకృష్ణప్రవీణ్, సూపర్‌వైజర్లు ఏ.పీటర్‌డేమియన్, నాగమల్లేశ్వరరావు, జోస్పిన్‌రాణి, భవానికుమారి, సీహెచ్‌ఓ శిరీష, కమల, రహిమూన్ పాల్గొన్నారు.

60 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి



క్రోసూరు: మండలంలో 15 సచివాలయాల ద్వారా మంగళవారం సాయంత్రానికి వలంటీర్ల ద్వారా 60 శాతం పింఛన్ల పంపిణీ చేసినట్లు ఈఓపీఆర్డీ పి.శివరామయ్య తెలిపారు. మండలంలో మొత్తం 8462 మందికి పింఛన్లు రూ.23,43,8750 (ఇరవైమూడు కోట్ల, నలభైమూడు లక్షల, ఎనిమిది వేల ఏడు వందల యాభై) పంపిణీ చేసేందుకు మంజూరు కాగా ఇప్పటికీ 60 శాతం మందికి(5077 మందికి) పింఛన్ల అందచేసినట్లు చెప్పారు. మిగతా మరి రెండురోజుల్లో పూర్తి చేస్తారని చెప్పారు.

ముగిసిన కొండవీడు రెవెన్యూ రీసర్వే ప్రక్రియ



యడ్లపాడు: వైఎస్సార్ జగనన్న భూహక్కు-భూరక్ష కార్యకమంలో భాగంగా మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేటలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ ఎన్.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభలో రీ సర్వేకు సంబంధించిన రైతులకు 9(2) నోటీసులు పంపిణీ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ కొండవీడు రెవెన్యూ పరిధిలో సుమారు 950 సర్వే నంబర్లలో మూడు నెలల పాటు రీసర్వే ప్రక్రియ కొనసాగిందన్నారు. ఆయా సర్వే నంబర్లలో కొలతలు నిర్వహించి రెవెన్యూ పరిధిలోని రైతులకు 9(2) నోటీసులను అందజేశామని, ఈ నోటీసుల్లో రైతుకు ఏ సర్వే నంబర్‌లో ఎంత విస్తీర్ణం కలిగిన భూమి ఉందో ఆ భూములకు కొత్తగా ఇచ్చిన ల్యాండ్ పార్సిల్ నంబర్‌లను తెలియజేయడం జరిగిందన్నారు. సదరు నోటీసులను చదువుకుని వాటిలో హద్దులు, విస్తీర్ణం ఇతరేత్ర అభ్యంతరాలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. లేదా మొబైల్ మేజిస్ట్రేట్‌కు అప్పీల్ చేసుకుని సత్వర పరిష్కారం పొందవచ్చన్నారు. ఇదే వేదికపై అందజేసినట్లు వెల్లడించారు. పీఏసీఎస్ చైర్మన్ బసెల శివ రామకృష్ణ, ఆర్ఐ చక్రవర్తి పాల్గొన్నారు.

జగనన్న సురక్ష .. సూపర్ సక్సెస్

- నియోజకవర్గంలో 75 సచివాలయాల్లో గ్రామ, వార్డు సభలు
- 17,162 అర్జీలకు 15,571 సర్టిఫికెట్లు పంపిణీ



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: అర్హులకు నూరుశాతం సంక్షేమ పథకాలే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. ఇంటింటికి వెళ్లి పథకాలు దరిచేరని వారిని పలకరించే విధంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టింది. అందుకు అనుగుణంగా వివిధ ధ్రువీకరణ పత్రాలు తక్షణమే మంజూరు చేసే విధంగా చర్యలు చేపట్టింది.

అధికారులు, ప్రజాప్రతినిధులు అన్ని ప్రాంతాల్లో పర్యటించి, ఉచితంగా అవసరమైన పత్రాలు అందజేశారు. నియోజకవర్గంలో 90 శాతం సమస్యల పరిష్కారంతో దిగ్విజయంగా సురక్ష కార్యక్రమం ముగిసింది.

జగనన్న సురక్ష సాగిందిలా...

గత నెల 23న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించిన తర్వాత నియోజకవర్గంలోని 75 సచివాలయాల్లోని 634 మంది ఉద్యోగులు, 1,488 మంది వలంటీర్లు ప్రతి ఇంటినీ జల్లెడ పెట్టారు. అర్హత ఉండీ, వివిధ కారణాల వల్ల పథకాలు అందక పోయినా సర్టిఫికెట్లు పొందలేక పోయినా.. వారి వివరాలు సేకరించారు. ఈ సర్వీసులన్నింటినీ రిజిస్టర్ చేసి వారికి టోకెన్లు ఇచ్చారు. ఆయా మండలాలకు చెందిన అధికారులు వీటిని పరిశీలించారు. ఇంటర్నెట్ సదుపాయం ఉండేలా ముందస్తు ఏర్పాటు చేసుకోవడం ద్వారా దాదాపుగా ఎలాంటి సమస్యలు లేకుండా అర్జీదారులకు సేవలు అందించగలిగారు.

అర్జీలకు 90 శాతం సమస్యల పరిష్కారం...

నియోజకవర్గ వ్యాప్తంగా 83,937 గృహాలు ఉండగా సచివాలయ యంత్రాంగం 67,253 గృహాలు (80 శాతం) సర్వే చేసింది. ఈ సర్వేలో ప్రజల నుంచి 16,503 అర్జీలు, అభ్యర్థనలు రాగా 15,059 అర్జీలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు, సమస్యల పరిష్కారం (90 శాతం) చేశారు.

నియోజకవర్గంలో గృహాల సర్వే ఇలా....

మండలం	మొత్తం గృహాలు	సర్వే చేసినవి
సత్తెనపల్లి టౌన్	19,222	15,522
సత్తెనపల్లి రూరల్	25,827	20,721
ముప్పాళ్ల	14,672	11,785
రాజుపాలెం	16,815	13,509
నకరికల్లు	22,056	16,168
మొత్తం	98,592	77,705

నియోజకవర్గంలో అర్జీలు, పరిష్కారం....

మండలం	అర్జీలు	పరిష్కారం
సత్తెనపల్లి టౌన్	5,665	5,324
సత్తెనపల్లి రూరల్	3,469	3,048
ముప్పాళ్ళ	4,155	3,813
రాజుపాలెం	1,743	1,482
నకరికల్లు	2,130	1,904
మొత్తం	17,162	15,571

సురక్ష కార్యక్రమంతో మేలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు సంవత్సరాల పారదర్శక సంక్షేమం, సంస్కరణలతో కూడిన సుపరిపాలనతోనే ప్రజల వద్దకు ధైర్యంగా వెళ్లగలిగాం. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుబంధంగా నిర్వహించిన ఈ సురక్ష కార్యక్రమం చారిత్రాత్మకం. రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు సహకారంతో దిగ్విజయంగా పూర్తి చేయగలిగాం.

–ఆర్.పురుషోత్తమరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, సత్తెనపల్లి

ప్రజల చెంతకే యంత్రాంగం



సంక్షేమ పథకాల అమలులో చిన్నచిన్న ధ్రువీకరణ పత్రాలు లేక ఇబ్బంది పడుతున్న వారికి, సేకరించుకోలేని వారికి జగనన్న సురక్ష కార్యక్రమం ఎంతగానో దోహద పడింది. రోజుల తరబడి తిరిగే పరిస్థితి లేకుండా ప్రజల వద్దకే ప్రభుత్వ యంత్రాంగం వెళ్లి వారికి సేవలందించింది. మండలం పరిధిలో 3,048 మంది సమస్యలు స్థానికం గానే పరిష్కరించి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందించాం.

– జీవీ.సత్యనారాయణ, ఎంపీడీఓ, సత్తెనపల్లి

రోడ్డు పనులు పరిశీలన



తొండపి(ముప్పాళ్ల): మండలంలోని తొండపి గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణం పనులను ఆ పథకం ఇన్‌చార్జి ఏపీడీ పి.వెంకటనారాయణ మంగళవారం పరిశీలించారు. సుమారు రూ.5లక్షల 3 వేల710 ల నిధులతో 1171 పనిదినాల తో పొలాలకు వెళ్లే రహదారి నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. రోజుకు 50 మంది కూలీలు పనికి హాజర వుతున్నారన్నారు. ఈ నిర్మాణం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, వర్షాకాలం నడిచేందుకు ఇబ్బందులు పడే పరిస్థితుల నేపథ్యంలో రహదారి నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు.

ప్రజల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

డెప్యూటీ డీఎంహెచ్‌ఓ చంద్రశేఖర్

క్రోసూరు: మండల పరిధిలోని ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు తమకు అప్పగించిన పనులు ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని, ప్రజల ఆరోగ్యాలపై అప్రమత్తంగా ఉండాలని డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చంద్రశేఖర్ కోరారు. మంగళవారం ఆశ డే సందర్భంగా క్రోసూరు పీహెచ్‌సీలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆశ యాప్‌పై అవగాహన కల్పించారు. ఇంద్రధనుస్సు కార్యక్రమాలన్నీ విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ బాల అంకమ్మబాయి, డాక్టర్ రమాదేవీ, డాక్టర్ సాద్ పాల్గొన్నారు.

నేత్ర సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

సత్తెనపల్లి: నేత్ర సంరక్షణపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని నేత్ర వైద్యుడు డాక్టర్ వాసుదేవరావు చెప్పారు. సత్తెనపల్లి మండలం ఫణిదం గ్రామంలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి, దంత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ వాసుదేవరావు మాట్లాడుతూ నేటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరు కంటికి సంబంధించిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కంటి నుండి నీళ్ల కారడం, పుసులు కట్టడం, కళ్ళల్లో మంటలు, కళ్ల ఎరబ్రారటం, లాంటి లక్షణాలు కనిపించినట్లయితే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. అమరావతి డెంటల్ కేర్ దంత వైద్యుడు డాక్టర్ నరసింహారావు మాట్లాడుతూ దంతాలపై గార పట్టడం, దంతాల నుండి, చిగుళ్ల నుండి రక్తం కారడం లాంటి లక్షణాలు కనిపించినట్లయితే వెంటనే దంత వైద్యులను సంప్రదించాలన్నారు. గ్రామ సర్పంచి వేమవరపు బుల్లిబాబు శిబిరాన్ని ప్రారంభించారు.



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వాసుదేవరావు

కంటి సమస్యలు ఉన్న 210 మందికి, దంత సమస్యలు ఉన్న 90 మందికి పరీక్షలు చేశారు. 12 మందికి కంటి శుక్లాలు అవసరమని గుర్తించారు. శిబిరంలో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు సురేష్, సోమశేఖర్ పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

వినుకొండ టౌన్: విజయవాడ బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాది ఆర్.ఆదిశేషు విఠల్ బాబు హత్య నిందితులను శిక్షించాలని వినుకొండ బార్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. హత్యకు నిరసనగా మంగళవారం న్యాయవాదులు తమ విధులకు గైర్హాజరై, నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ కోసం ప్రభుత్వం సత్వరమే తగు చర్యలు తీసుకోవాలని కోరారు. చట్టాలను మరింత బలోపేతం చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు వీరాంజనేయ చౌదరి కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సీతా రామాంజనేయులు, సెక్రటరీ హనుమంతరావు, కోశాధికారి నాగేశ్వరరావు, గంధం హరిప్రసాద్, సీనియర్ న్యాయవాదులు పీజే లూక, సిహెచ్.వెంకిరెడ్డి, టి.హనుమంతరావు, ఎలీషాబాబు, బి.శ్రీనివాసులు, జెట్టి తిరుపతిరావు, మీసాల శ్రీనివాసరావు, రమణారావు, అప్పారావు, తలారి ఆంజనేయులు, అశోక్ బాబు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న వినుకొండ బార్ అసోసియేషన్ సభ్యులు

మణిపూర్ ఘటనపై శాంతిర్యాలీ

దాచేపల్లి : మణిపూర్ హింసఖండ ఘటనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం శాంతిర్యాలీ నిర్వహించారు. మండలంలోని కేసానుపల్లి క్రీస్తు లూథరన్ దేవాలయం ఆధ్వర్యంలో పాస్టర్ గనుపల్లి శ్యామ్ ప్రసన్నకుమార్ పర్యవేక్షణలో సంఘస్తులు, సండేస్కూల్ విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. మణిపూర్ ఘటనకు కారణమైన వ్యక్తులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులు చేయడం. మహిళలను వివస్త్రను చేసి ఊరేగించడం దుర్మార్గమైన చర్యలని, చర్చిలను కూడా ధ్వంసం చేయడం మంచి విధానం కాదని పాస్టర్ శ్యామ్ ప్రసన్నకుమార్ అన్నారు. కార్యక్రమంలో ఏఈఎల్‌సీ డేలిగేట్ వినుకొండ బాబు, చర్చి డేలిగేట్ శ్రీపతి కాశయ్య, సర్పంచ్ వినుకొండ కోటేశ్వరరావు, సంఘ పెద్దలు వినుకొండ సుధీర్‌కుమార్, వినుకొండ యాకోబు, వినుకొండ వజ్రం, శ్రీపతి లింగయ్య, మీసాల ఇర్మియా, మీసాల ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.



కేసానుపల్లిలో ర్యాలీ చేస్తున్న స్థానికులు

మణిపూర్ ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి

మాచర్ల: మణిపూర్ రాష్ట్రంలో మహిళల పై జరిగిన అకృత్యాలు పునరావృతం కాకుండా అక్కడి ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని క్రైస్ట్ పల్నాడు పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం సమావేశంలో వారు మాట్లాడుతూ క్రైస్తవుల పై దాడులు జరగడం బాధాకరమన్నారు. ఇటువంటివి జరగకుండా ఉండాలని ప్రార్థనలు నిర్వహించారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలకు రక్షణ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ సర్జన్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ దాసు, టౌన్ ప్రెసిడెంట్ రవిబాబు, నియోజక వర్గం ట్రెజరర్ పీటర్ పాల్, గౌరవ అధ్యక్షులు చంద్రపాల్, నియోజక వర్గ జాయింట్ సెక్రెటరీ కుక్కమూడి వెంకయ్య తదితరులున్నారు.



సమావేశంలో పాల్గొన్న క్రైస్ట్ పల్నాడు పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు

గర్భిణి అనుమానాస్పద మృతి

సత్తెనపల్లి: గర్భిణి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామానికి చెందిన కొరబండి నాగేశ్వరరావు, గురజాల మండలం దైద గ్రామానికి చెందిన గాలి వెంకటప్రియ(24)కు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. నాగేశ్వరరావు ఆటో నడుపుతూ జీవిస్తున్నారు. వీరికి ఒక కుమార్తె ఉంది. ప్రస్తుతం వెంకట ప్రియ 8వ నెల గర్భిణి. గత నెల 27న మరిది కోటయ్యకు వివాహమైంది. ఆ దంపతులు అత్తారింటికి వెళ్లారు. కుటుంబ కలహాల నేపథ్యంలో నాగేశ్వరరావు, వెంకట ప్రియ దంపతులకు మధ్య ఇటీవల వాదనలు జరిగాయి. ఈక్రమంలో మంగళవారం ఇంటిలో చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు భర్త నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులు సమాచారం ఇచ్చారు. దీంతో వెంకటప్రియ కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద ఎత్తున తరలివచ్చి వెంకట ప్రియ మృతదేహాన్ని పరిశీ లించారు. వెంకట ప్రియ మృతిపై అనుమానం వ్యక్తం చేశారు. పథకం ప్రకారమే ఆమెను హతమార్చినట్లు ఆవేదన వెలిబుచ్చారు. దీనిపై సత్తెనపల్లి రూరల్ స్టేషన్ వద్దకు చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు వివరాలు సేకరించి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా ఎఫ్ఏ -1 పరీక్షలు ప్రారంభం



సత్తెనపల్లి: పట్టణం, మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఫార్మేటివ్-1 పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఒకటి నుంచి 8 తరగతి వరకు విద్యనభ్యసించే విద్యార్థులకు క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్మెంట్(సీబీఏ) విధానంలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులందరికీ ప్రశ్నపత్రంతో పాటు జవాబు పత్రాలకు బదులు ఓఎంఆర్ షీట్లను ఇచ్చారు. కాంపిటేటివ్ పరీక్షలు మాదిరిగానే విద్యార్థులు ఓఎంఆర్ షీట్‌లో బబ్లింగ్ చేసి జవాబు పత్రాన్ని నింపారు. 9, 10 తరగతి విద్యనభ్యసించే విద్యార్థులకు మాత్రం పాత విధానం (నిర్మాణాత్మక మూల్యాంకనం)లోనే పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ విద్యాసంస్థలతో పాటు అన్ని ప్రైవేట్ యాజమాన్యాలు ఫార్మేటివ్-1 పరీక్షలను నిర్వహించారు. వీరందరికీ ప్రభుత్వమే ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్లు అందజేసింది. మండల విద్యాశాఖ అధికారి ఏ శ్రీనివాసరావు పరీక్షలను పరిశీలించి సూచనలు చేశారు.

తల్లిపాలు అమృతంతో సమానం



సత్తెనపల్లి: తల్లిపాలు అమృతంతో సమానమని అంగన్‌వాడీ కార్యకర్తలు అన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని సత్తెనపల్లి మండలం ధూళిపాళ్లలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టిన శిశువులకు డబ్బా పాల కంటే తల్లి పాలు జీర్ణం చేసుకోవడం సులువు అన్నారు. ప్రతి ఒక్కరూ పుట్టిన బిడ్డకు తల్లిపాలను ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా ప్లకార్డులతో ప్రదర్శన చేపట్టి నినాదాలు చేశారు.

వృద్ధుడిపై దాడి

నరసరావుపేట టౌన్: వృద్ధుడిపై నలుగురు యువకులు దాడికి పాల్పడిన ఘటన మంగళవారం పట్టణంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. ప్రకాష్‌నగర్‌కు చెందిన పసుపులేటి సత్యనారాయణ 60 అడుగుల రోడ్డు దాటుతుండగా ఆ సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ప్రభాకర్ ఢీకొట్టాడు. నిర్లక్ష్యంగా వాహనం నడపడంపై సత్యనారాయణ ప్రశ్నించడంతో ప్రభాకర్, అతని ముగ్గురు స్నేహితులతో కలసి దాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు.

మానసిక సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

నరసరావుపేట ఈస్ట్: చిన్నారులు, పెద్దలలో పెరుగుతున్న మానసిక సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ ఆఫ్ క్లినికల్ సైకాలజిస్ట్స్ అధ్యక్షుడు డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. పాతూరులోని ప్రత్యేక అవసరాలు గల పిల్లల వనరుల కేంద్రం భవిత పాఠశాలను మంగళవారం సందర్శించారు. మానసిక దివ్యాంగులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. నేడు సామాజిక పరిస్థితులలో చిన్నారులతో పాటు పెద్దలలో కూడా మానసిక సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. పరిస్థితులకు అనుగుణంగా ఆయా సమస్యలపై అవగాహనతో వాటిని అధిగమించాలని, లేని పక్షంలో మానసిక రుగ్మత పెరుగుతుందన్నారు. ఆందోళన కలిగిన సమయంలో సకాలంలో వైద్యులను సంప్రదించి మానసిక సమస్యల నుంచి బయటపడవచ్చని సూచించారు. మానసిక సమస్యల నిర్మూలనకు తమ సంస్థ పనిచేస్తున్నదని వివరించారు. మానసిక దివ్యాంగులతో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని హితవు పలికారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినిలు జి.మేరికుమారి, ఎస్.పద్మజా పాల్గొన్నారు.

నర్సరీ యజమానులు నిబంధనలు పాటించాలి

ఉద్యాన శాఖ అధికారిణి జనని

సత్తెనపల్లి: నర్సరీ యజమానులు నిబంధనలు పాటించాలని ఉద్యాన శాఖ అధికారి సిహెచ్.జనని చెప్పారు. సత్తెనపల్లి మండలం వెన్నాదేవి, కంకణాలపల్లి గ్రామాలలో షేడ్ నెట్ నర్సరీలను క్షేత్రస్థాయిలో మంగళవారం పరిశీలించారు. నర్సరీదారులకు నర్సరీ చట్టం-2010 ప్రకారం నర్సరీ రిజిస్ట్రేషన్, లైసెన్స్ కొరకు పాటించాల్సిన నిబంధనలను వివరించారు. ముఖ్యంగా నర్సరీ లైసెన్స్ కొరకు షేడ్ నెట్ చుట్టూ 8-14 అడుగుల ఎత్తు వరకు ఇన్‌సేక్ట్ ప్రూఫ్ నెట్ తో రక్షణ కల్పించాలన్నారు. నెట్ హౌస్ డబల్ డోర్ సిస్టమ్ కలిగి ఉండాలని, నెట్ హౌస్ లో ఉన్న షేడ్ నెట్ గాని, ఇన్‌సేక్ట్ గాని కీటకాలు లోపలికి ప్రవేశించడానికి అవకాశం లేకుండా ఎటువంటి రంధ్రాలు ఉండరాదన్నారు. నారును ప్రోటేలలో నాటి వాటిని ఎత్తైన మడులపై అమర్చాలన్నారు. ప్రోటేలలో శుద్ధి చేసిన కోకోపీట్ మాత్రమే వాడాలన్నారు. శుద్ధి చేయుటకు కోకోపిట్‌కు ఒక కేజీ ట్రైకోడెర్మా విరిడి, ఒక కేజీ సూడోమోనస్ కలపాలన్నారు. నర్సరీ యజమాని విత్తనాన్ని కొనుగోలు చేసినప్పుడు విత్తనాల ప్యాకెట్ మీద విత్తనం రకం, లాట్ నెంబర్, కంపెనీ యొక్క లేబుల్ని గమనించి నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. విత్తనాల బిల్లు నకలు కాపీలను సంబంధిత ఉద్యాన శాఖాధికారికి సమర్పించాలన్నారు. నర్సరీ యజమాని తప్పనిసరిగా నర్సరీకి సంబంధించిన రికార్డు లు నిర్వహించాలని కోరారు. నర్సరీదారులు ప్రతి ఒక్కరు లైసెన్స్ కోసం తప్పనిసరిగా ఉద్యాన శాఖ అధికారికి దరఖాస్తు చేసుకోవాలన్నారు.



నర్సరీ రికార్డులను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారిణి జనని

మిర్చి నారుమళ్లలో తెగుళ్ల నివారణ

అమరావతి: ఇటీవల వారం రోజుల పాటు కురిసిన వర్షాలకు మిరప నారుమళ్లల్లో వచ్చే తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని, వీటిలో నారు కుళ్లు, కానోఫోరా తెగులు, పైముడత, కింది ముడత, పొగాకు లద్దె పురుగుల ఉనికి ఎక్కువగా ఉంటుందని మండల వ్యవసాయశాఖాధికారి అహ్మద్ అన్నారు. మంగళవారం ఆయన రైతులకు సూచనలిచ్చారు. జూలై, ఆగస్టు నెలల్లో కురిసే వర్షాలకు నారుమడుల్లో నీరు నిలిచిపోయి నారు కుళ్లు తెగులు ఉధృతంగా వ్యాపిస్తుందన్నారు. దీని నివారణకు విత్తిన తర్వాత నాలుగైదు రోజులకు లీటరు నీటికి మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా రెండు గ్రాముల రిడోమిల్ కలిపి నాలుగైదు రోజులకు ఒకసారి చొప్పున రెండు మూడు పర్యాయాలు పిచికారీ చేయాలని చెప్పారు. అధిక వర్షాలు కురిసే వాతావరణంలో కానోఫోరా కొమ్మకుళ్ల తెగులు వృద్ధి చెందుతుందని, ఈ తెగులు సోకితే నారు మొక్కచివర్లో కొమ్మకుళ్లడం, ఆకులు కుళ్లిపోయి మొక్కలు కుంగిపోవటం, చనిపోవడం జరుగుతుందన్నారు. దీని నివారణకు లీటరు నీటికి రెండు మిల్లీలీటర్ల హెక్సాకొనజోల్ లేదా మూడు గ్రాముల ఆక్సీక్లోరైడ్ పిచికారీ చేయాలన్నారు. నారు మడుల్లో ట్రిపునిల్ గుళికలు వేస్తే 20 రోజుల వరకు పైముడత తెగులు ఆశించే అవకాశాలు తక్కువగా ఉంటాయని. ఆతర్వాత ఆశించే పైముడత నివారణకు లీటరు నీటికి రెండు మిల్లీలీటర్ల రీజెంట్ లేదా 1.5 గ్రాముల ఎసిఫేట్ కలిపి పిచికారీ చేయాలన్నారు. కింది ముడత నివారణకు లీటరు నీటికి 2.5 గ్రాముల నీటిలో కరిగే గంధకం, అయిదు మిల్లీలీటర్ల డైకోఫాల్, మూడు మిల్లీలీటర్ల ఫోసలోన్ వంటి మందులను పిచికారీ చేయాలన్నారు.



వైకుంఠపురం వద్ద పెంచుతున్న మిర్చి నారుమళ్లు

ఆశ కార్యకర్తకు ఆర్థిక సహాయం

రాజుపాలెం: సీజనల్ వ్యాధులపై ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు అపరమత్తంగా ఉండాలని ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ కృష్ణకుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశ, ఆరోగ్య కార్యకర్తలకు సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణకుమార్ మాట్లాడుతూ మీతోపాటు చేసేచౌటపాపాయపాలెంకు చెందిన ఆశ కార్యకర్త బెజ్జం సామ్రాజ్యం అనారోగ్యంతో భాదపడుతూ మంచానికే పరిమితమైనందున మనందరం సహాయ సహకారాలు అందించాలని కోరారు. వైద్యశాల సిబ్బంది, ఆశ కార్యకర్తలు కలసి రూ.36,500 ఆమె కుమార్తె పద్మావతికి అందించారు. కార్యక్రమంలో డాక్టర్ రవితేజ నాయక్, ఆప్తామిక్ అధికారి సత్యనారాయణ, మలేరియా అధికారి ప్రభాకర్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు జీవన్‌రావు, గ్లోరీ పాల్గొన్నారు.



ఆశ కార్యకర్త కుమార్తె పద్మావతికి ఆర్థిక సహాయం అందిస్తున్న వైద్యులు, సిబ్బంది